క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌గా బాధ్యతల స్వీకరణ



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.అనురాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బోధన, బోధనేతర సిబ్బంది ఆమెను అభినందించారు. అకడమిక్ అంశాలు, క్లాస్ వర్కుపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. అకడమిక్ క్యాలెండర్ పక్కాగా అమలు చేయనున్నట్లు చెప్పారు.

సంతాపం..

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఎగ్జామినేషన్ సెక్షన్‌లో పని చేస్తున్న సూపరింటెండెంట్ ఎల్.అప్పారావు బుధవారం మృతి చెందారు. పలు విభాగాల్లో సేవలు అందించారు. వీసీ కె.ఆర్.రజిని, రెక్టార్ బి.అడ్డయ్య, అధికారులు, సిబ్బంది సంతాపం తెలియజేశారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలో వేంచేసిన అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పాలతో అభిషేకాలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

భారీ వర్షం



ఎస్‌ఎంఆర్‌పురం రోడ్డులో కూలిన చెట్లు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవటంతో రైతులు ఎదురుచూస్తున్నారు. వరి విత్తనాలు వేసేందుకు వర్షం అనుకూలంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎచ్చెర్ల నుంచి ఎస్ఎస్ఆర్‌పురం రోడ్డులో నీలగిరి చెట్లు కూలటంతో విద్యుత్ సరఫరాకు కొంత సమయం అంతరాయం కలిగింది.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యేగా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి మొదటిసారిగా నియోజకవర్గానికి విచ్చేసిన ఆయనకు ఎన్‌డీఏ కూటమి సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రామతీర్థాల కూడలిలో స్వాగత ద్వారానికి శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారిపై ప్రసంగించడంతో గంట సమయం ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

ఘనంగా మంజునాథేశ్వర వార్షికోత్సవం



మంజునాథేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: ఇల్లీసుపురం వద్దగల రైల్వే వీధిలోని షిర్డీసాయి మహాసమాధి శతాబ్ది మందిరంలో ఉన్న మంజునాథేశ్వరుని వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు మావుడూరి రాఘవశర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పుష్పాభిషేకం చేశారు. అనంతరం అన్నాభిషేకం జరిగింది. షిర్డీసాయి బాబా సేవా సత్సంగం, భజన బృందం, విశాఖ-బీ కాలనీ వారిచే భజన కార్యక్రమం జరిగింది.

నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ విషయాన్ని గౌరవ అధ్యక్షులు పిన్నింటి అప్పన్న తెలిపారు. అధ్యక్షులుగా గంజి ఆర్ ఎజ్రా, ఉపాధ్యక్షులుగా బీవీఆర్ బద్రి, ప్రధాన కార్యదర్శిగా బమ్మిడి వేణు, కె.చిన్నారావు, కోశాధికారిగా బలగ మోహన్, సంయుక్త కార్యదర్శిగా ఆకుల కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా గుర్నాల ధర్మారావు, కలమట నారాయణమూర్తి, నల్ల నారాయణ, గొర్లె జీవా, సీహెచ్ బాలును ఎన్నుకున్నట్టు తెలిపారు.

మత్తుకు బానిసకావొద్దు

- సెబ్ అదనపు ఎస్పీ గంగాధరం



రణస్థలం: ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఈబీ అధికారులు, విద్యార్థులు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జేడీ గంగాధరం



ర్యాలీలో సెబ్ సిబ్బంది

శ్రీకాకుళం క్రైమ్: విద్యార్థులు, యువత మత్తుకు బానిసై తమ బంగారు భవితను పాడు చేసుకోవద్దని జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ (జాయింట్ డైరెక్టర్) డి.గంగాధర్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు 250 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే సెబ్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు అధికారులు ఫ్లెక్సీలు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేడీ గంగాధరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కళాశాలలు, పార్టీలకు ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్లే సమయంలో అపరిచిత వ్యక్తులు చాక్లెట్లు, పౌడర్ రూపంలో ఉండే డ్రగ్స్‌ను శీతల పానీయాల్లో కలిపేస్తూ తినమంటూ, తాగమంటూ ఒత్తిడి చేస్తారని.. ఎట్టి పరిస్థితుల్లో అలాంటివి సేవించరాదన్నారు. తాను విశాఖ గాజువాకలో పనిచేసినప్పుడు ఐదుగురు ఐఐటీ విద్యార్థులపై నార్కోటిక్స్ కేసు నమోదు చేశామన్నారు. ఏడు విదేశాల నుంచి హైదరాబాద్ కేంద్రంగా కొరియర్ ద్వారా డ్రంగ్స్ చేరినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. కొంతమందిపై తల్లిదండ్రుల నిర్లక్ష్య వైఖరి ప్రభావం పడుతుందన్నారు. డ్రగ్స్ రహితంగా సమాజాన్ని తీర్చిదిద్దాలని, ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద మాదకద్రవ్యాలు వాడేవాళ్లు నేరస్తులుగా క్రిమినల్ రికార్డుల్లో ఉంటారని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఈఎస్ తిరుపతినాయుడు, ఏఈఎస్ ఎం.వినీషా, సీఐ ఎం.వి.గోపాలకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ (జేడీ కార్యాలయం) షర్మిల, ఎస్ఐలు, డీటీఎఫ్, ఇంటిలిజెన్సు, జేడీ, సెబ్ స్టేషన్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలం: మత్తు పదార్థాలకు అలవాటుపడితే జీవితాలు నాశనమవుతాయని జే.ఆర్.పురం సీఐ జి.రామచంద్రరావు, రణస్థలం ఎస్ఈబీ ఎస్ఐలు రవి ప్రసాద్, నాగలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని సాయి డిగ్రీ కళాశాల, ఆదర్శ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. జే.ఆర్.పురం ఎస్ఐ కె.గోవిందరావు, ఎస్ఈబీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ ఎస్.చిరంజీవి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎచ్చెర్లలో పాత జాతీయ రహదారిపై ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: యువత ఎక్కువగా మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని.. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా ఆయా వ్యసనాలకు దూరం చేయవచ్చునని ఏపీ బీసీ న్యాయవాదుల సంఘట జిల్లా అధ్యక్షులు ఆగూరు ఉమామహేశ్వరరావు అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బీసీ న్యాయవాదుల సమక్షంలో కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైస్కూల్ స్థాయిలో మాదక ద్రవ్యాల నియంత్రణ, వ్యసనాలు, చెడు అలవాట్లు వల్ల వచ్చే అనర్థాలు అంశంగా పాఠ్యాంశం ఉండాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, బీసీ న్యాయవాదుల సంఘం కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు, అఫీసియల్ రిసీవర్ సీతారామ్మూర్తి, న్యాయవాదులు కొమ్ము రమణమూర్తి, బగాది అప్పలనాయుడు, బి.వి.రమణ, బి.జోగారావు ఉన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..

శ్రీకాకుళం కల్చరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, దివ్యాంగులశాఖ సహాయ సంచాలకులు కొల్లు కవిత, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, విశ్రాంత జాయింట్ కలెక్టర్ రజనీకాంతరావు మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు దూరంగా యువత ఉండాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు, చిలుకు లక్ష్మీకాంత్, నిక్కు హరిసత్యన్నారాయణ, చైతన్య, రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, సిబ్బంది, కాకినాడ ఆదిత్య ఉమెన్స్ కాళాశాల, న్యూసెంట్రల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: ర్యాలీ నిర్వహిస్తున్న ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు



శ్రీకాకుళం కల్చరల్: ఏడురోడ్ల కూడలి వద్ద ప్రదర్శన

సందడిగా అంతర్జాతీయ బ్యూటీషియన్ డే



బ్యూటీషియన్స్‌డే సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: ఇంటర్నేషనల్ బ్యూటీషియన్ డే కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం సందడిగా జరిగింది. స్టార్ బ్యూటీస్ గ్రూప్ అడ్మిన్, ప్రముఖ బ్యూటీషియన్ ప్రిస్కిల్లా గిరిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది ఎం.సత్యన్నారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి హాజరై మాట్లాడారు. ముఖారవిందం ఒక్కటే అందం కాదని, వారి మనసును సైతం అందంగా తీర్చిదిద్దడమే బ్యూటీషియన్ ఉద్దేశమన్నారు. బ్యూటీషియన్ కోర్సులో ఆసక్తి ఉన్న మహిళలందర్ని ఒక గ్రూప్‌గా ఏర్పాటు చేసి వారి ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ప్రతి ఫంక్షన్‌లోనూ బ్యూటీషియన్ల అవసరాన్ని సమాజం గుర్తించేలా గిరిరాజ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎవరిమీదా ఆధార పడకుండా ఈ రంగాన్ని ఎంచుకొని సమాజంలో బ్యూటిషియన్ అవసరాన్ని చాటి చెప్పిన వారందరికీ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్యూటీషియన్లను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు పడపాన సుగుణారెడ్డి, బూటీషియన్లు ధనుశ్రీ, శారదా, సావిత్రి, సంధ్య, ప్రియాంక, మాధురి, వసంత, పార్వతి, సంతోషి, అను, సత్య, మంజు, సంతోషి టెక్నీషియన్ నెజిమ, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



సామూహిక కుంకుమపూజల్లో భక్తులు



అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డీసీసీబీ కాలనీలో ఉన్న భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ మూడో వార్షికోత్సవంలో భాగంగా బుధవారం మహాలక్ష్మి అమ్మవారికి సామూహికంగా కుంకుమ పూజలు జరిగాయి. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, చామర్తి జగన్నాథాచార్యుల నేతృత్వంలో మహాలక్ష్మి అమ్మవారి ఉత్సవ మూర్తిని వేదికపై ఉంచి మహిళలతో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దుంపల సన్యాసిరావు మాట్లాడుతూ.. నాలుగో వార్షికోత్సవం సమయానికి స్వామివారికి బంగారు కిరీటం చేయించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. దాతలు ఎవరైనా ఇందులో పాలు పంచుకోవచ్చని కోరారు. ఇప్పటికే ఇద్దరు దాతలు ముందుకువచ్చి తమ సహాయాన్ని ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా బిర్లంగి రామ్మోహన్‌రావు బృందం సహకారంతో సుమారు నాలుగు వేల మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. శ్రీకాకుళం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్, బొడ్డేపల్లి సురేష్, సురంగి మోహనరావు, దానేటి రూపాంఖ్, కమిటీ సభ్యులు ఉన్నారు.

సుపరిపాలన అందించాం

- మండల సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

కంచిలి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాలు మెచ్చేలా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సుపరిపాలన అందించామని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కంచిలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సేవ చేయడానికేనని, దీన్ని గుర్తుంచుకొని సంయమనంతో వ్యవహరించాలని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి గెలుపొందారని, వాటిని సక్రమంగా అమలు చేయాలని అన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘనపై చర్చ..

ఇదిలా ఉండగా వ్యవసాయ శాఖకు సంబంధించిన సమీక్షలో విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమంలో ప్రజలతో ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి పంపిణీ చేపట్టడంపైన స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, మిగతా సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మిగతా శాఖల యంత్రాంగం కూడా ఇకముందు ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల నుంచి రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి, ఆహ్వానించాలని ఎంపీపీ సూచించారు. విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో సాగరనౌగాం, పెద్దశ్రీరాంపురం, నాతపుట్టుగ, కొరికానపుట్టుగ తదితర గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీన్ని సరిచేయాలని సభ్యులు కోరారు. వైఎస్సార్ చేయూత పథకం కింద పలువురు మహిళలకు ఇంతవరకు పూర్తిస్థాయిలో వారి అకౌంట్లలో 18,750 రూపాయలు ఇంకా జమవ్వలేదని, ఆయా ఖాతాలకు డబ్బులు జమయ్యేటట్లు చూడాలని ఎంపీపీ దేవదాస్‌రెడ్డి వైఎస్సార్‌కేపీ సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వి.నీరజ, తహసీల్దార్ ఎం.వి.కె.ఎస్.రవి, ప్రత్యేక ఆహ్వానితులు వజ్జ మృత్యుంజయరావు, దుర్గాసి ధర్మారావు, లడ్డు కేశవపాత్రో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలోని మహాత్మ జ్యోతిపూలే మత్స్యకార గురుకుల పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను తన క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లీలా, పద్మ, పార్వతి, సావిత్ర, లక్ష్మి, సునీత ఉన్నారు.

మహానంది పురస్కారానికి కృష్ణారెడ్డి ఎంపిక



కృష్ణారెడ్డి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శాస్త్రీయసంగీత కళాకారులు ఆశి కృష్ణారెడ్డి మహానంది పురస్కారానికి ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ పి.వి.నరసింహరావు జయంతి ఉత్సవాలు–2024 సందర్భంగా తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో ఈనెల 30వ తేదీన జరుగనున్న కార్యక్రమంలో కృష్ణారెడ్డికి అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని స్వచ్ఛందసంస్థ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ నుంచి సమాచారం వచ్చినట్టు కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి

టెక్కలి: యుక్త వయసు కలిగిన బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గైనకాలజిస్టు డాక్టర్ స్వర్ణరేఖ సూచించారు. రుతుక్రమం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, మహిళా సాధికార విభాగం సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

సంతబొమ్మాళి: పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని టెక్కలి డీఎల్‌పీవో ఐ.వి.రమణ అన్నారు. వాటర్ ట్యాంకులు, బావుల్లో క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నతుంగాం, తాళ్లవలస, కాపు గోదాయవలస పంచాయతీల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. ముందుగా సచివాలయాలను సందర్శించి సిబ్బంది హాజరు, పంచాయతీల రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో ఆరోగ్య అవగాహన సర్వే చేస్తున్న సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఎ.గోపాలరావు, చిన్నతుంగం సర్పంచ్ సిమ్మ గోవిందరావు, స్థానిక పంచాయతీ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, తాళ్లవలస కె.జి.వలస పంచాయతీ కార్యదర్శి సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పలాస: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బొడ్డపాడు సర్పంచి తామాడ మదన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బొడ్డపాడు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో స్థానిక వైద్య సిబ్బంది, సచివాలయం అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. కాలువల్లో పూడికలు తీయాలని, మంచినీటి ట్యాంకర్లను శుభ్రం చేయాలని చెప్పారు. ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి ఉన్నారు.

ప్రథమచికిత్స పెట్టెలు ఏర్పాటు

ఇచ్ఛాపురం: స్థానిక స్వచ్ఛందసంస్థ జేసీఐ సౌజన్యంతో ఇచ్ఛాపురం పట్టణంలోని నాలుగు ప్రదేశాల్లో ప్రథమచికిత్స పెట్టెలను ఏర్పాటు చేశారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, విద్యుత్ కార్యాలయం ఆవరణలో వీటిని బుధవారం ఏర్పాటు చేశారు. జేసీఐ అధ్యక్ష, కార్యదర్శులు షణ్ముఖరావు, పవన్‌కుమార్, ప్రతినిధులు డిల్లేశ్వరరావు, స్వరూప్‌కుమార్, మధు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



పొన్నాడ గ్రామంలో పర్యటిస్తున్న డీఎల్‌పీఓ గోపిబాల



ఎస్ఎంపురంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల క్యాంపస్:

పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో పక్కాగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీకాకుళం డీఎల్‌పీఓ గోపిబాల అన్నారు. పొన్నాడ గ్రామాన్ని బుధవారం సందర్శించారు. డ్రైనేజీలు, రోడ్డులను పరిశీలించారు. డ్రైనేజీలు పూర్తిగా శుభ్రం చేయాలని, రోడ్డులపై చెత్త, నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. రక్షిత మంచినీటి పథకాలు క్లోరినేషన్ చేయాలని, నీటి నమూనాలు పరీక్షించాలని, పరీక్షించిన తరువాత మాత్రమే నీటి సరఫరా చేయాలన్నారు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

ఎస్ఎంపురంలో..

ఎచ్చెర్ల క్యాంపస్: పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా ఎస్ఎంపురంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. డ్రైనేజీలు శుభ్రం చేశారు. కాలువల్లో పూడికలు తొలగించారు. రోడ్డులు శుభ్రం చేశారు. సర్పంచ్ కోన సూర్యారావు పర్యవేక్షించారు.

నేత్రపర్వంగా శ్యామసుందరస్వామి వార్షిక కల్యాణం



కల్యాణం చేస్తున్న అర్చకులు



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి పట్టణంలోని శ్యామసుందర ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణాన్ని బుధవారం నేత్ర పర్వంగా నిర్వహించారు. అర్చకుడు పద్మనాభ పండా నేతృత్వంలో వేద పండితుడు భానుమూర్తి పర్యవేక్షణలో రుక్మిణి సమేత శ్యామసుందరస్వామి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు ఆసక్తిగా ఈ సుందర సన్నివేశాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను తిరువీధిగా ఊరేగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



హోమంలో భక్తులు

వజ్రపుకొత్తూరు: పూండి-గోవిందపురంలోని అయ్యప్పస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచే సుప్రభాత సేవా ప్రారంభమైంది. గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, ఉత్తరాల బాలరాజు దంపతులచే హోమ, అయ్యప్పకు ప్రీతి పాత్రమైన నారికేళ, పంచామృత, నెయ్యాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులు అన్నదానం చేశారు.ఆలయ గురుస్వాములు రాజారావు, దశరధరావు, పి.వేణుగోపాలరావు, ఎల్.శంకరరావు, కె.రాజేష్, గుంట సత్యం ఉన్నారు.

ఘనంగా అమ్మవారికి పూజలు



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామదేవత అసిరిపోలమాంబ అమ్మవారి దేవాలయ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం, కుంకుమ పూజలు జరిగాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సర్పంచ్ తామాడ పద్మావతి, ఉప సర్పంచ్ సాహుకారి జాని, అనంత్ పెద్దకోట బత్తుల శంకర్ పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహించాలి



అధికారలతో సమీక్షిస్తున్న భరత్‌నాయక్

కాశీబుగ్గ: పలాస రెవెన్యూ డివిజన్‌ని ఉద్యోగులంతా సక్రమంగా విధులు నిర్వహించాలని ఆర్డీవో భరత్ నాయక్ ఆదేశించారు. తన కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రోడ్లు వంటి సమస్యలపై దృష్టిసారించి అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డీఎల్‌డీవో, డీఎల్‌పీవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, విద్యుత్ ఏఈలు, ఆర్అండ్‌బీ ఈఈ, ఎస్ఈబీ సీఐ, మైన్స్ ఏడీ పాల్గొన్నారు.